జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
గురువారం | 18 | జూన్ | 2026 | పేజీలు : 6



# భారీ వర్షాల వల్ల ఏ ఒక్కరికి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ముందస్తు అప్రమత్తం

- నకిలీ విత్తనాలు అంట గట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదు
- వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్




ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి : జిల్లాలో రానున్నరోజుల్లో భారీ వర్షాల వల్ల ఏ ఒక్కరికి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ముందస్తు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు.రానున్న వర్షాలు మిగతా 2 లో...




# రుచికి బాల్యం బానిస

2 లో..

- రంగురంగుల స్నాక్స్ మోజులో చిన్నారులు
- పాఠశాలల వద్ద నాణ్యతలేని తినుబండారాల విక్రయాలు
- ఆకర్షణీయమైన ప్యాకెట్లలో అనారోగ్యపు ముప్పు
- ఆహార భద్రతా తనిఖీలపై తల్లిదండ్రుల ఆందోళన
- పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న చిరుతిండ్ల సంస్కృతి

పిల్లవాడి చేతిలో కనిపించే రంగురంగుల స్నాక్స్ ప్యాకెట్ కేవలం చిరుతిండి మాత్రమే కాదు... అది భవిష్యత్తు ఆరోగ్యంపై నిశ్శబ్దంగా ప్రభావం చూపే ప్రమాద సంకేతమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాఠశాల గంట మోగగానే పుస్తకాల దుకాణాల కంటే చిరుతిండ్ల దుకాణాల వైపు చిన్నారుల అడుగులు వేగంగా సాగుతున్నాయి. రుచులు, రంగులు, ఆకర్షణీయమైన ప్రకటనల మాయలో పడుతున్న పిల్లలు తెలియకుండానే అనారోగ్యానికి చేరువవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం....

-ప్రజాజ్యోతి డెస్క్

# నిర్దేశిత సమయంలో టిజి ఐపాస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పూర్తి చేయాలి




- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- టిజి ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి : జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి–ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధికారులతో టిజి–ఐ–పాస్ కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్ అనుమతులు, టి – ప్రైడ్ పై పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల అనుమతులకు వేచి యున్న ప్రతిపాదనల సమస్యలపై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను మిగతా 2 లో...

# రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు క్యాన్సర్ వ్యాధి తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు



ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జి.ఓ. ఎం.ఎస్. నెం.17, 06-04-2026 ద్వారా క్యాన్సర్ వ్యాధిని రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధిగా ప్రకటించినట్లు జిల్లా వైద్యమరియు ఆరోగ్యశాఖ అధికారి డా. డి. రామారావు తెలిపారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో, క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, మరణాల రేటు, చికిత్స ఫలితాలు, భౌగోళిక వ్యత్యాసాలు,ప్రమాద కారకాలపై ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి ప్రజారోగ్య ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్, స్వయంప్రతిపత్తి సంస్థల ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ఈఎస్ఐ, రైల్వే, రక్షణ శాఖ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్,క్యాన్సర్ చికిత్స కేంద్రాలు,పాథాలజీ మరియు రేడియాలజీ ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆరోగ్య బీమా సంస్థలు, జనన–మరణాల నమోదు కార్యాలయాలు, సంబంధిత మిగతా 2 లో...

# రేపటి భవిష్యత్తు నేటి పిల్లలదే

- కందుకూరు హైస్కూల్ లో యూనిఫామ్ నోట్ పుస్తకాలు పంపిణి చేసిన సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి



వేంసూరు జూన్ 17 ప్రజాజ్యోతి కందుకూరు గ్రామ ప్రభుత్వ పాఠశాల లో బడి బాట కార్యక్రమం లో పాల్గొని, పుస్తకాలు పంపిణి చేసిన సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మట్టా రాగమయి కష్ట పడి, ఇష్ట పడి, పట్టుదల తో చదివి జీవితంలో లో ఉన్నత స్థాయి లో ఉండాలి అని విద్యార్థిని, విద్యార్థుల కు సుచించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా, వైద్యం, వ్యవసాయం పై ప్రత్యేక శ్రద్ద చూపిస్తూ, ప్రగతి పదం వైపు నడిపిస్తున్నారు అని తెలియజేసినారు పిల్లలు ఫోన్ లకు దూరం గా ఉండాలి అలాగే తల్లి తండ్రులు పిల్లలు ఏమి చేస్తున్నారు అని శ్రద్ద చూపాలి,గమనించాలి అని తెలిపారు రేపటి భవిష్యత్ ఈనాటి మన చదువు మీద ఆధారపడి ఉంటుంది అని గురువులను మిగతా 2 లో...

## టిజి ఐపాస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో టీ –ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఎస్సీ, 13ఎస్టీ యూనిట్లకు ఒక కోటి 35 లక్షల 31 వేల 146 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. పావలా వడ్డీ క్రింద ఒక ఎస్టీ యూనిట్ కు 46 వేల 374 రూపాయల సబ్సిడీ అందించామన్నారు. పరిశ్రమల శాఖ సంక్షేమ శాఖల సమన్వయంతో పథకాలు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జి.ఎం.పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ ,లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్,ఆర్టీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి , విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి...)

,నకిలీ విత్తనాల విక్రయాలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గతంలో పడిన భారీ వర్షాలతో చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతి ప్రవహించడం ద్వారా దెబ్బ తిన్న వంతెనలు, చప్టలను సందర్శించడం, వరద ప్రభావం ఎంతవరకు వచ్చిందో పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రమాదాల భారీన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా వర్షాల వల్ల ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా, నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ రోడ్లను క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవాలని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.ముఖ్యంగారైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటించాలన్నారు.తక్కువ ధరలకు తెలియని వ్యక్తుల నుండి కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని,ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు.

## క్యాన్సర్ వ్యాధి తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధి

(మొదటి పేజీ తరువాయి...)

ఇతర సంస్థలు తమ వద్ద నిర్ధారణ అయిన ప్రతి క్యాన్సర్ కేసును వ్యాధి నిర్ధారణ జరిగిన ఒక నెలలోపు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.క్యాన్సర్ రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాధి నిర్ధారణ, చికిత్స, పాలియేటివ్ కేర్, పునరావాస సేవలు,దీర్ఘకాలిక పర్యవేక్షణ వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చి, రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.అలాగే జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు,వైద్యులు,ల్యాబొరేటరీలు ,సంబంధిత సంస్థలన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించి, ప్రతి క్యాన్సర్ కేసును సకాలంలో నమోదు చేయాలని డా.డి.రామారావు కోరారు.క్యాన్సర్ కేసుల నివేదికలు పూర్తిస్థాయిలో అందినప్పుడే వ్యాధి భారాన్ని అంచనా వేసి,అవసరమైన చికిత్సా వసతులు,నివారణ చర్యలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు మరియు ప్రజారోగ్య విధానాలను మరింత సమర్థవంతంగా రూపొందించవచ్చని ఆయన తెలిపారు.

## రేపటి భవిష్యత్తు నేటి పిల్లలదే

(మొదటి పేజీ తరువాయి...)

, తల్లి తండ్రులను, సమాజం ను గౌరవించాలి అని పాఠశాల విద్యార్థుల కు తెలిపారు ఈ కార్యక్రమం లో వేంసూరు మండలం ఎమ్ ఈ ఓ కందుకూరు ఇంచార్జ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ చైర్మన్, వేంసూరు మండలం ఏ యమ్ సి వైస్ చైర్మన్ వెంకటప్ప రెడ్డి,సొసైటీ చైర్మన్ గొర్ల సంజీవ్ రెడ్డి,ఖమ్మం జిల్లా డీసీసీ సెక్రటరీ సోమిరెడ్డి, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, అట్లూరి సత్యనారాయణ రెడ్డి, బరణిపాడు నాని,కందుకూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ నెంబర్స్, ఇందిరమ్మ కమిటీ, మహిళా, యూత్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు




# రుచికి బాల్యం బానిస

- రంగురంగుల స్నాక్స్ మోజులో చిన్నారులు
- పాఠశాలల వద్ద నాణ్యతలేని తినుబండారాల విక్రయాలు
- ఆకర్షణీయమైన ప్యాకెట్లలో అనారోగ్యపు ముప్పు
- ఆహార భద్రతా తనిఖీలపై తల్లిదండ్రుల ఆందోళన
- పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న చిరుతిండ్ల సంస్కృతి

**పిల్లవాడి చేతిలో కనిపించే రంగురంగుల స్నాక్స్ ప్యాకెట్ కేవలం చిరుతిండి మాత్రమే కాదు... అది భవిష్యత్తు ఆరోగ్యంపై నిశ్శబ్దంగా ప్రభావం చూపే ప్రమాద సంకేతమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాఠశాల గంట మోగగానే పుస్తకాల దుకాణాల కంటే చిరుతిండ్ల దుకాణాల వైపు చిన్నారుల అడుగులు వేగంగా సాగుతున్నాయి. రుచులు, రంగులు, ఆకర్షణీయమైన ప్రకటనల మాయలో పడుతున్న పిల్లలు తెలియకుండానే అనారోగ్యానికి చేరువవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం....**

**-ప్రజాజ్యోతి డెస్క్**

జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా చిన్నారులను లక్ష్యంగా చేసుకుని ప్యాకెట్ ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కుర్‌కురేలు, చిప్స్, రింగ్స్, పఫ్‌లు, చాక్లెట్లు, కేకులు, బిస్కెట్లు, శీతల పానీయాలు వంటి ఉత్పత్తులు ప్రతి చిన్న దుకాణంలో దర్శనమిస్తున్నాయి. తక్కువ ధర, అధిక రుచి, ఆకర్షణీయమైన ప్యాకింగ్ కారణంగా పిల్లలు వీటికి అలవాటు పడుతున్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ఈ విక్రయాలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### ♦ రంగురంగుల ప్యాకెట్లు... లోపల అనారోగ్యపు ముప్పు

పిల్లలను ఆకర్షించేందుకు తయారీ సంస్థలు కార్టూన్ బొమ్మలు, రంగురంగుల కవర్లు, బహుమతుల ఆఫర్లను వినియోగిస్తున్నాయి. అయితే అనేక ప్యాకెట్ ఆహార పదార్థాల్లో అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు, కృత్రిమ రంగులు, రుచికారక రసాయనాలు ఉండే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ వీటిని తీసుకోవడం వల్ల జీర్ణకోశ సమస్యలు, ఊబకాయం, దంత సమస్యలు, పోషకాహార లోపాలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

### ♦ పాఠశాలల వద్దే ఎక్కువ ఆకర్షణ

జిల్లాలోని అనేక పాఠశాలల సమీపంలో చిరుతిండ్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. మధ్యాహ్న విరామ సమయంలో, పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులు పెద్ద సంఖ్యలో వీటిని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది చిన్నారులు ఇంటి నుంచి తీసుకువచ్చే ఆహారాన్ని కూడా పక్కనపెట్టి ప్యాకెట్ ఆహారాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో పిల్లల్లో పోషకాహార లోపం పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### ♦ నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు


కొన్ని ప్రాంతాల్లో గడువు ముగిసిన ఉత్పత్తులు లేదా నాణ్యతపై సందేహాలు ఉన్న ఆహార పదార్థాలు కూడా విక్రయమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యతా గుర్తులను పరిశీలించకుండా విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని ఉత్పత్తులపై తయారీ సంస్థ వివరాలు కూడా స్పష్టంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### ♦ ఎక్కడ ఆహార భద్రతా తనిఖీలు ?

ఆహార భద్రతా నిబంధనల ప్రకారం విక్రయించే ప్రతి ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో తనిఖీలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నాణ్యతలేని ఆహార పదార్థాల విక్రయాలను అరికట్టాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

### ♦ చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నం

పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశాన్ని అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని



ప్రజలు కోరుతున్నారు. ఆహార భద్రతా శాఖ తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల సమీప ప్రాంతాల్లో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. పిల్లల చేతిలో కనిపించే చిన్న ప్యాకెట్ కేవలం చిరుతిండి మాత్రమే కాదు... అది వారి ఆరోగ్య భవిష్యత్తును ప్రభావితం చేసే అంశం. రుచికి బానిసలవుతున్న బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కుటుంబానిదే కాదు... సమాజం, ప్రభుత్వం, సంబంధిత శాఖలదీ. పిల్లల నవ్వుల్లో ఆరోగ్యం దాగి ఉంటుంది... ఆ ఆరోగ్యాన్ని కాపాడటమే ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి పునాది.



# మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే నారీ భేటీని జయప్రదం చేయండి

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మరియు మహిళా కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ మహిళా కాంగ్రెస్ నారీ భేటీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21-06-2026 మధ్యాహ్నం 02.00 గంటలకు ఖమ్మం పట్టణం లోని సప్తపది ఫంక్షన్ హాల్ నందు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అధ్యక్షతన నారీ భేటీ సమావేశం కలదు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పార్లమెంట్ సభ్యులు శాసనసభ సభ్యులు పాల్గొంటారు .కావున జిల్లా లోని మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రజాప్రతినిధులు మరియు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయిలో ఉన్న మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమమును జయప్రదం చేయాలని పత్రికాముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మరియు జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఈకార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు దామా స్వరూప, మహిళా కాంగ్రెస్ నాయకులు బలుసు లక్ష్మీ,ఊరుకొండ చంద్రిక , రేఖా భార్గవి,గోవిందమ్మ, మంగ, బొ డ్డు బొందయ్య, కిలారు అనిల్ కుమార్ , కొట్టే రాజశేఖర్,మద్దినేని రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఎంపిక

- **ప్రెసిడెంట్ ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్ అంజని కుమార్**



**సత్తుపల్లి జూన్17(ప్రజా జ్యోతి )** సత్తుపల్లి సింగరేణి సంస్థ లో కాంట్రాక్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెంట్ వల్లెపు ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్ చెట్టి మల్ల అంజని కుమార్ ను ఎన్నుకున్నారు. సింగరేణి సంస్థపై ఆధారపడి పనిచేస్తున్న సింగరేణి ప్రభావిత ప్రాంత భూనిర్వాసితుల కు సింగరేణి సంస్థ కాంట్రాక్ట్ పద్ధతిన సంస్థలో వాహనాలు పెట్టుకోవడానికి అవకాశం కల్పించి, ఉపాధి కల్పిస్తున్నందున సింగరేణి సంస్థకు ఎల్లప్పుడు డ్రైవర్స్ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రసాదరావు , అంజని కుమారులు తెలియజేశారు. అదేవిధంగా డ్రైవర్లకు రావాల్సిన జీతభత్యాల పెరుగుదల, సీ.ఎం.పి.ఎఫ్ మరియు ఈ.స్.ఐ హాస్పటల్ సదుపాయాలు ప్రతి ఒక్కరికీ వర్తించేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు,డ్రైవర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మండలం ఆరోగ్యం లో ఆదర్శంగా ఉండేలా కృషి



**నేలకొండపల్లి, జూన్ 17 ప్రజా జ్యోతి:** జిల్లాలోనే నేలకొండపల్లి మండలం సంపూర్ణ ఆరోగ్య మండలం గా ఆదర్శంగా నిలిచేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బోదులబండ, చెరువుమాధారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి మండల టాస్క్ ఫోర్స్ సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. రానున్న వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు ముందస్తుగా తీసుకోవాలని సూచించారు. ముందుగా గుర్తించిన గ్రామాలలో ఆరోగ్య క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల పై అవగాహన . కల్పించాలని సూచించారు. ఈ నెల 28 న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం ను విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోనే ' ఆదర్శంగా ఉండేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డెంగీ, మలేరియా, ఇతర అంటు వ్యాధులను తరిమికొట్టాలని సూచించారు. దోమ పుట్టకుండా...కుట్టకుండా.. మురుగు కాల్వలలో ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు. వైద్యాధికారులు డాక్టర్. రచ్చా శ్రావణకుమార్, ఎస్.గీతా, ఐసీడీఎస్ సీడీపీవో కవిత, సూపర్వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన



**కారేపల్లి, జూన్ 17, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలంలో పలు అభివృద్ధి, శుభ కార్యక్రమంలో నేడు గురువారం వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ పాల్గొననున్నట్లు బుధవారం ఎమ్మెల్యే కార్యాల సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 10 గంటలకు సీతారాంపురం గ్రామంలో వివాహ వేడుకల్లో పాల్గొంటారు. 11.00 గంటలకు మాదా రం గ్రామంలో 30 లక్షలతో CC రోడ్లు మరియు డ్రైనేజీలకు శంకుస్థాపన, 11.30 గంటలకు మాదారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం,ఇందిరా మహిళా సమాఖ్య వి ఓ బిల్డింగ్ శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొంటారు.మధ్యాహ్నం 12 .30 గంటలకు మాదారం గ్రామంలో సింగరేణి మండ లం అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.00గంటలకు సింగరేణి మండలం కార్యకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించబడును. సింగరేణి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ శాఖా అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు, తప్పకుండా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు.

# పరిశుభ్రతే ప్రగతికి పునాది

- **గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా నిలబెడతాం**
- **బోనకల్ గ్రామ సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ బానోత్ కొండ**

**బోనకల్, జూన్ 17(ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యాచరణలో భాగంగా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, ప్రజా బాధ్యతలపై సర్పంచ్ జ్యోతి కొండ కీలక సూచనలు చేశారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, నీరు రోడ్లపైకి చేరి దోమలు, వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు.నిబంధనలను ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలువల్లో చెత్త వేస్తే గ్రామ పంచాయతీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. బహిరంగ మలమూత్ర విసర్జన పూర్తిగా మానుకోవాలని, గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా నిలబెట్టడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి పరిశుభ్రతే ప్రధాన ఆధారం అని ఆయన పేర్కొన్నారు. గ్రామ పరిధిలోని వ్యాపారులు తమ వ్యాపార అనుమతి పత్రాలను వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయంలో పునరుద్ధరించుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో అన్ని వ్యాపార సంస్థలు నిబంధనలకు లోబడి పని చేయాలని కోరారు.గ్రామాభివృద్ధి అనేది కేవలం అధికారుల బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఉప సర్పంచ్ బానోతు కొండ అన్నారు. ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి గ్రామ పంచాయతీకి సహకరిస్తే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన గ్రామంగా బోనకల్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**పరిశుభ్రమైన గ్రామం –** ఆరోగ్యవంతమైన సమాజం" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇరిగేషన్ అధికారి కొండలరావు, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, మండల అధికారులు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు తెల్లాకుల శ్రీనివాసరావు, బిళ్ళ విశ్వనాథం, మండల పరిషత్ మాజీ ఉప అధ్యక్షులు గుగులోతు రమేష్, తెలకులపల్లి సాంబయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు యార్లగడ్డ కుమారి, మరిదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మేర సాహెబ్, జరుపల లావణ్య, తాళ్లూరి జ్యోతి, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, నాయకులు బదావత్ హుస్సేన్, నిమ్మల రాజశేఖర్, కలవల బాబు, సెల్ పాయింట్ సాయి కృష్ణ, వేమా లలిత, టైగర్ విజయ్, జిడుగు వెంకటేశ్వర్లు, బోడ అంజి, యోగి శ్రీనివాస్, జర్పల శివ కృష్ణ, జూపల్లి వెంకటేశ్వర్లు, ధారావతు సాధు, వ్యాపారస్తులు, స్థానిక ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# నేటి నుండి యూరియా బుకింగ్ యాప్

- **రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **మండల వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్ కుమార్**



**బోనకల్, జూన్ 17 (ప్రజా జ్యోతి):** మండలంలో నేడు అనగా గురువారం నుండి యూరియా బుకింగ్ అప్ ద్వారా యూరియా సరఫరా చేయడం జరుగుతుందనీ మండల వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్ కుమార్ అన్నారు. కావున రైతులు తమ ఇంటి నుండే యూరియా బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. చాలా వరకు లాస్ట్ సీజన్ లో రైతులకు యాప్ పైన అవగాహన ఉన్నదని, రైతులకు ఏం అయినా సందేహాలు ఉంటే మీ పరిధిలో ఉన్న ఏ ఈ ఓ, సీఈఓ ఎస్ నీ సంప్రదించాలని అన్నారు.రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 1800 123 7157 కాల్ చేసి మీ యొక్క సమస్యను పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఒకవేళ మొబైల్ నెంబర్ లింక్ కాకపోతే సంబంధిత ఏఈఓ ను సంప్రదించి మొబైల్ నెంబర్ లింక్ చేయించుకోవాలని తెలిపారు. గురువారం ఉదయం 6గంటల నుండి యూరియా మండలంలో ఏ షాపు లో ఉన్న బుక్ చేసుకోవచ్చునని తెలియజేశారు. కావున మండలంలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భీమవరం సర్పంచ్ వంట్ల రమేష్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు



**వేంసూర్,జూన్ 17 ప్రజా జ్యోతి** భీమవరం గ్రామ పంచాయతీ నందు సర్పంచ్ వంట్లా రమేష్ ఆధ్వర్యంలో యుపిఎస్ స్కూల్ నందు వర్షాకాలం దుష్ట నీళ్లు నిలువ ఉండటం వల్ల స్కూల్ పిల్లలు ఇబ్బంది పడతారని స్కూలు ఉపాధ్యాయులు సర్పంచ్ కు తెలియజేయడం జరిగింది వెంటనే సర్పంచ్ వంట్ల రమేష్ మట్టి పోయించి డోజర్ తో సరి చేయించడం జరిగింది స్కూల్ లో పిల్లలకు యూనిఫామ్ నోట్ పుస్తకాలు ఇవ్వటం జరిగింది

## యూరియా వచ్చేసింది కానీ యాప్ లోనే బుకింగ్

- రైతు సోదరులు అవకాశం ఉపయోగించుకోండి
- మండల వ్యవసాయం అధికారి పి. రామ్మోహన్



**వేంసూర్ జూన్ 17 ప్రజాజ్యోతి** వేంసూర్ మండల రైతు సోదరులకు రేపటి నుంచే యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బుధవారం ఉదయం ఆరు గంటల నుంచే యూరియా బుకింగ్ యాప్ ద్వారానే యూరియా బుక్ చేసుకొని రైతులు కొనుగోలు చేసే విధానం అమలు. మన వేంసూర్ మండల రైతు సోదరులకు ఇప్పటికే 4867బ్యాగులను ఆయా సొసైటీ మరియు ప్రైవేట్ షాపులలో అందుబాటులో ఉంచాము. రైతు సోదరులు గూగుల్ ప్లే స్టోర్ లో ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అనే యాప్ ను ఆండ్రాయిడ్ ఫోన్ లలో ఇన్స్టాల్ చేసుకొని యూరియాను మీ ఇంటి దగ్గర నుంచే బుక్ చేసుకోవచ్చు. ఎకరాకు 2 బ్యాగులు బుక్ అవుతాయి. ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు, ఎకరానికి రెండు బ్యాగులు చొప్పున బుక్ చేసుకోవచ్చు. బుక్ అయిన యూరియా విడతల వారీగా మీకు అందుబాటులో ఉంటుంది. ఏ పంటకైన మొదటి విడతలో ఎకరానికి 2బ్యాగులు బుక్ చేసుకొనే అవకాశం ఉంది. మీరు బుక్ చేసుకొన్న యూరియా 24 గంటల వరకు మీరు కొనుగోలు చేసుకొనే అవకాశం ఉంది.ఆండ్రాయిడ్ ఫోన్ లేని వారు, ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన మీ దగ్గర బంధువులు లేదా మీ దగ్గరలోని సొసైటీ లేదా ఎరువుల షాపు సిబ్బంది లేదా AEO లను సంప్రదిస్తే, మీకు వచ్చే OTP ద్వారా మీకు వారు బుక్ చేస్తారు. ఏమైనా సందేహాలు ఉంటే మీ దగ్గరలోని AEO లను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్ తెలిపారు.

## కవల పిల్లల కోసం ఆర్థిక సహాయం

- గుడిపూడి తిరుమల రావు



**కారేపల్లి, జూన్ 17, ప్రజా జ్యోతి:** స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సూచన మేరకు, సింగరేణి మండల పరిధిలోని రేగులగూడెం పంచాయతీ పరిధిలోని చీమలవారి గూడెం గ్రామానికి చెందిన చెవుల శ్రీను మనవడు, మనవరాలులు కవల పిల్లలు వారి కన్నతల్లి లేదు. ఆ చిన్నారులు పాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు ఇబ్బంది పడుతున్న విషయం గమనించిన కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు బుధవారం వారి కి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారుల పట్ల మానవత్వం చాటుకున్న గుడిపూడి తిరుమల రావుకి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రేగులగూడెం సర్పంచ్ మోతి వీరాస్వామి, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, జక్కుల కుమార్, శ్రీ షేక్ హాజీమియా, పొట్లకాయల మహేష్ , వరికోర్ల వీరభద్రం, సామినేని తిరుపతి రావు , రేగులగూడెం వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## హైస్కూల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ

- పాల్గొన్న సర్పంచ్ కిలారు మనోహర్ బాబు.

**చింతకాని జూన్ 17 ప్రజాజ్యోతి :** చింతకాని మండల కేంద్రంలో ఉన్నటువంటి ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ కిలారు మనోహర్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని.ప్రభుత్వ అందిస్తున్న ఉచిత విద్యను అందుకోవాలని పాఠశాలలో అనుభవజ్ఞులు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువులోనే కాకుండా ఆటల్లో కూడా ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో నఉన్న అవసరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ఈ యొక్క సమావేశంలో ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు కిలారు బాబురావు, షేక్ రహీమ్ తుల్లా, కోలా నాగేశ్వరావు, నారపోగు రామకృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా న్యూ స్టార్ హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే





- సకల సౌకర్యాలతో పిల్లల హాస్పిటల్ ఏర్పాటు
- సత్తుపల్లి రోజురోజుకీ అభివృద్ధి చెందటం అభినందనీయం

**సత్తుపల్లి జూన్17(ప్రజా జ్యోతి)** పట్టణంలోని యు.పి.ఎస్ రోడ్ లో న్యూ స్టార్ చిల్డ్రన్స్ హాస్పిటల్ నూతనంగా డాక్టర్ సురేష్ రామాల ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన హాస్పిటల్ ను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, హాస్పిటల్ మొత్తం కలియతిరిగి సురేష్ రామాల దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్పటల్లో చిన్నారుల కోసం అడ్వాన్స్ ఆపరేషన్ థియేటర్, ఎన్.ఐ.సి.యు, ఐసీయూ, జనరల్ సర్జరీ, చెవి,ముక్కు, గొంతు ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్స్, పీడియాట్రిక్స్ అన్ని డిపార్ట్మెంట్లతో సకల సౌకర్యాలతో విలాసవంతమైన భవనం హాస్పిటల్ కి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులకు ఏ దైనా ఇబ్బంది అయితే విజయవాడ, ఖమ్మం వెళ్లే అవకాశం లేకుండా సత్తుపల్లి లోనే ఇన్ని సౌకర్యాలు ఉండటం ఎంతో ఉపయోగమని, దీని ద్వారా వ్యయం,సమయం ఆదావుతుందని ఇం కా మరింతగా సత్తుపల్లి పట్టణం అభివృద్ధి చెందాలని కోరారు. ఆమె వెంట మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, చల్లగుండ్ల నరసింహారావు, నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

- మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.25,116 లు బహుమతి
- గ్రామ స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.10,116 లు బహుమతి
- విద్యే జీవితానికి వెలుగుబాట
- బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ



**బోనకల్, జూన్ 17(ప్రజా జ్యోతి):** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. బోనకల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పదో తరగతిలో ఉత్తీర్ణులై మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.25,116 నగదు బహుమతి అందజేస్తామని, అలాగే గ్రామస్థాయిలో మొదటి స్థానం సాధిస్తే రూ.10,116 నగదు బహుమతి ప్రకటించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించి, ఉన్నత ఫలితాలు సాధించేలా ప్రోత్సహించడమే ఈ నిర్ణయం లక్ష్యమని తెలిపారు.నేటి సమాజంలో విద్య ఎంతో విలువైన ఆస్తి అని, చదువుతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. పేదరికాన్ని జయించడానికి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలకు క్రమం తప్పకుండా పంపిస్తూ చదువులో ప్రోత్సహించాలని కోరారు. గ్రామం నుంచి మరింత మంది ప్రతిభావంతులు తయారై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల విజయం గ్రామాభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పోటువెంకటేశ్వర్లు, మరిదు శేషు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నూతన ఎస్సై ను కలిసిన సిపిఎం నాయకులు



**బోనకల్, జూన్ 17 (ప్రజా జ్యోతి):** బోనకల్ పోలీస్ స్టేషన్లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మాచినేని రవిని బుధవారం మండల సిపిఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ముఖ్యంగా గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని, మాదకద్రవ్యాల పట్ల యువతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎస్ఐ ను కలిసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు, పెద్ద బీరవెల్లి సర్పంచ్ చింతలచెరువు కోటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి కిలారి సురేష్, రావినూతల ఉపసర్పంచ్ దొండపాటి సత్యనారాయణ, కెవిపిఎస్ నాయకులు ఏసు పోగు బాబు, సిపిఎం సీనియర్ నాయకులు పెద్ద ప్రోలు కోటేశ్వరరావు లు ఉన్నారు.

## దశ దిన కూడికలో పాల్గొన్న సర్పంచ్ మనోహర్ బాబు

**చింతకాని జూన్ 17 రాజాజ్యోతి :** చింతకానిలో ఇటీవల రోడ్డు ప్రమాదం లో చనిపోయిన పదవ వార్డు మెంబెర్ మాతంగి నాగరాజు దశ దిన కార్యక్రమం లో పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, నాగరాజు ఆత్మ కు శాంతి కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ పొనుగోటి బాబు, కిలారు బాబురావు, ఆకాష్, కోలా నాగేశ్వరావు, కృష్ణ, ఉమరాజు, నారపోగు రామకృష్ణ కూచిపూడి సతీష్, మరియు తదితరులు పాల్గొన్నారు.



# సీజన్ కు సరిపడ యూరియా ఉంది

- ఎండలలో విత్తనాలు విత్తవద్దు
- డీఏవో పుల్లయ్య



**కారేపల్లి, జూన్ 17, ప్రజా జ్యోతి:** ఖమ్మం జిల్లాలో యూరియా యాఫ్ విజయవంతమై క్యూలైన్ల కథ ముగిసిందని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య అన్నారు. బుధవారం సింగరేణి మండలంలో సోసైటీ అధ్వర్యంలోని యూరియా సేల్ పాయింట్లను అయన తనిఖీ చేశారు. విత్తనాల దుకాణాలను పరిశీలించి దుకాణాలలో ఉన్న విత్తన ప్యాకెట్లు, స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల లైసెన్సులు, బిల్లు పుస్తకాలను తనిఖీ చేశారు. ప్రతి రైతుకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కారేపల్లి సోసైటీలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు పార్మర్ రిజిస్ట్రీ, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నానో యూరియా, నానో డిఏపీ పై రైతులకు జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య వివరించారు. యూరియా యాఫ్ తో రైతుకు దిగులు తగ్గిందన్నారు. వచ్చే వ్యవసాయ సీజన్ నుండి దేశం అంతట అన్ని రకాల ఎరువులకు యాప్ బుకింగ్ రానుందన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలో యూరియా, డిఏపీ తో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు సైతం యాఫ్ ద్వారానే అమ్మకాలు సాగుతున్నాయన్నారు. ఈ సీజన్ లో ప్రయివేటు డీలర్లు యూరియా అమ్మకాలకు సముఖుత చూపటం లేదని, మార్క్ ఫెడ్ ద్వారా అందిస్తున్న రేట్లు గిట్టుబాటు కావటం లేదని ప్రయివేటు వారు యూరియాను దుకాణాలకు తెప్పించటం లేదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు వేదికలు, సేల్ పాయింట్ల ద్వారా అమ్మకాలు చేయిస్తున్నట్లు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ చివరి నాటికి 32 వేల టన్నుల యూరియా వాడకం జరిగిందని తెలిపారు. ఈ ఏడాది 35 వేల టన్నులకు అంచనా వేశామని దానికి అనుగుణంగా ఇప్పటికే 21వేల టన్నుల యూరియా ఖమ్మం జిల్లాకు వచ్చి ఉందన్నారు. ఇంక రావల్సిన 14 వేల టన్నులు త్వరలో రానుందన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన అరుతడి పంటలవైపు మొగ్గుచూపాలని రైతులను కోరారు. ఎలినో ప్రభావం కనిపిస్తుందని, ఎండలలో విత్తనాలు నాటి నష్టపోవద్దని సూచించారు. పత్తి పంటను జూలై 15వ తేది వరకు విత్తుకోవచ్చన్నారు. వర్షాలు రాక ముందే తొంతరపడి విత్తనాలు విత్తుకోవద్దన్నారు. బోరుబావులలో సైతం భూగర్భజలాలు అడుగంటాయని, వాటి క్రింద వరి వేసే రైతులు సాగు తగ్గించి పెసర, మినుము, జొన్న పంటలను వేసుకోవాలని సూచించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని, కాంప్లెక్స్ ఎరువులలో సైతం యూరియా ఉంటుందని తెలిపారు. యూరియా వేయటంతో ద్వారా 70 శాతం వృద్ధా అయి కేవలం 30 శాతం మాత్రమే పంటకు అందుతుందన్నారు. నానో యూరియా, నానో డిఏపీలు తక్కవ ఖర్చు ఎక్కువ ప్రతిఫలం వస్తుందని పరీక్షలు నిర్వహించిన అనంతరమే సిపార్స్ చేయటం జరుగుతుందన్నారు. వైరా ఏడివో తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో అనిల్, ఏఈవో లు నరేష్, మహేష్, మున్నీ, సోసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఆత్మ కమిటీ డైరక్టర్ భూక్య పద్మ పాల్గొన్నారు

## రైతుల సమస్యలు పరిష్కారం చేయాలి

- బోనకల్ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన సిపిఎం నాయకులు



**బోనకల్, జూన్ 17 (ప్రజా జ్యోతి):** రైతుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని మండల సిపిఎం నాయకులు స్థానిక తహసిల్దార్ చల్లూరి సుధాకర్ కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో రైతుల మొక్కజొన్నలు కొనుగోలు చేసి 45 రోజులు కావస్తున్న కొనుగోలు చేసిన డబ్బులు మాత్రం ఇంతవరకు వారి అకౌంట్లో పడలేదన్నారు. అదేవిధంగా సెల్ఫోన్ లేని రైతులు, చదువురాని రైతులకు యూరియా యాప్ ద్వారా నష్టం జరుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. పంటలు సాగు చేస్తున్న రైతులకు యూరియా అందటం లేదన్నారు. ఖరీఫ్ సాగుకు విత్తనాల కొనుగోలుకు పంట ఖర్చులు, డీజిల్ పెట్రోల్ రేట్లు పెరిగినందున వ్యవసాయ ఖర్చులు కూడా పెరిగాయి అన్నారు. కావున వెంటనే వ్యవసాయ భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేయించాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని అన్నారు. అదేవిధంగా మొక్కజొన్న కొనుగోలు చేసిన డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలని, యూరియా యాప్ ను రద్దుచేసి సాగు చేస్తున్న రైతులకు యూరియా అందించాలని, రైతు భరోసా నిధులను వెంటనే వేయించాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహసిల్దార్ కు అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, సిపిఎం సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్, నాయకులు బండి శ్రీను, ఏసు పోగు బాబు, పెద్దపోలు కోటేశ్వరరావు లు ఉన్నారు.

## నేడు జర్నలిస్టుల ఛలో హైదరాబాద్

- ఉదయం 10 గంటలకు గన్ పార్క్ నుంచి ర్యాలీ ప్రారంభం
- అధిక సంఖ్యలో పాల్గొనాలని జర్నలిస్టులకు మామిడి సోమయ్య పిలుపు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జర్నలిస్టుల సమస్య పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నేడు జర్నలిస్టుల ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు.నేడు ఉదయం 10 గంటలకు రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్ కు తరలివచ్చే జర్నలిస్టులతో అసెంబ్లీ వద్ద గల గన్ పార్క్ నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనలో జర్నలిస్టులతో పాటువివిధ పత్రికల నిర్వహకులు,కేబుల్ టీవీ నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ జర్నలిస్టుల పట్ల స్వరాష్ట్రంలోనే పాలకుల వివక్ష కొనసాగుతుందని,ముఖ్యంగాచిన్న మధ్య తరహా పత్రికలకు,వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కావస్తున్నా జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, గత ప్రభుత్వంలో మాదిరిగానే వివక్ష కొనసాగుతుందని ధ్వజమెత్తారు.చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ కు రెండేళ్ళుగా అడ్వర్టైజ్మెంట్ బిల్లులు ఇవ్వలేదని,అడ్వర్టైజ్మెంట్స్ తగ్గించారని అన్నారు. అన్ని మీడియా సంస్థలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ కు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్రికలకు ఎంప్యానల్ తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని,ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని,చిన్న,మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని కోరారు.జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా హెల్త్ కార్డులు, భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు పెంచాలని, ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ టీవి) న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని,డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కేటాయింపు విషయంలో ప్రభుత్వం ఇంత వరకు సరైన నిర్ణయం తీసుకోకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నదని, ఈ ధోరణి విడనాడి కొత్త పాలసీతో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదే విధంగా సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని,మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధనకై ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

- టిపిసిసి జిల్లా జనరల్ సెక్రటరీ దుద్దిళ్ళ శ్రీనుబాబు



**బోనకల్, జూన్ 17 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలో బోనకల్ లో కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ ల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి పి సి సి జిల్లా జనరల్ సెక్రెటరీ దుద్దిళ్ళ శ్రీనుబాబు హాజరయ్యారు. బూత్ లెవెల్ ఏజెంట్లకు మార్గనిర్దేశం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు... గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. శిక్షణ శిబిరంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, ఎన్నికల నిబంధనలు, పార్టీ సంస్థాగత బలోపేతం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా శిక్షణ అందించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని, ఎన్నికల ప్రక్రియలో వారు సమర్థవంతంగా పనిచేసేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ ఎర్రం శెట్టి సుబ్బారావు, వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టినరోజుకు మొక్క నాటండి... పర్యావరణానికి తోడ్పడండి

- మిస్ట్ కళాశాల ప్రిన్సిపల్ చలసాని హరికృష్ణ



**సత్తుపల్లి జూన్17(ప్రజా జ్యోతి)** ప్రతి వ్యక్తి తన పుట్టినరోజు,పెండ్లి రోజు, ముఖ్యమైన రోజులలో ఒక్క మొక్క నాటి దానిని సంరక్షిస్తే పర్యావరణానికి ఎంతో కొంత మేలు చేసిన వారము అవుతామని, అదే ఉద్దేశంతో మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అధినేత చలసాని సాంబశివరావు, వారి తనయుడు చలసాని హరికృష్ణ బుధవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా మొక్కను నాటినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పుట్టినరోజు ప్రతిసారి మొక్క నాటి దానిని సంరక్షిస్తున్నానని, ఈ విధంగా 2019 చేస్తున్నానని, అందరూ పర్యావరణాన్ని కాపాడేందుకు,ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే రాబోయే తరాలకు పర్యావరణం రక్షించేందుకు ఎంతో కొంత మేరకు, మేలు చేసిన వారు అవుతారని తెలియజేశారు. రాబోయే తరానికి కొంతమేరకు పచ్చదనాన్ని బహుమానంగా ఇవ్వాలని కోరినారు.

## చిన్నారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం రెహానా కమల్

- ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు

**సత్తుపల్లి జూన్17(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి విద్యపై,వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చక్కటి పథకాలను అందిస్తున్నారని, అలాంటి పథకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని,ఉన్నత స్థితికి చేరాలని మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత అన్నారు. బుధవారం 3వ వార్డులో ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను వారు విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వంటి చక్కటి పథకాలతో విద్యకు



ప్రోత్సాహం అందిస్తున్నారని,ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించి,మంచి విద్యను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు నాగళ్ళ నాగేశ్వరరావు,బెజవాడ రాంబాబు,మల్లెల్లి అనిల్, యువసేవ సమితి రాజు, రాము, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు,అధికారులు



**చింతకాని జూన్ 17ప్రజాజ్యోతి :**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 26న చింతకాని మండలాల్లోని పాల్గొననున్న బహిరంగ సభ ఏర్పాట్లలో భాగంగా లచ్చగూడెం, జగన్నాధపురం,రామకృష్ణాపురం, గ్రామాల్లోని సభా స్థలాన్ని మండల కాంగ్రెస్ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు. సభ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, పార్కింగ్ సౌకర్యాలు,తాగునీరు, భద్రతా చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.సభా స్థల పరిశీలన కార్యక్రమంలో చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగబలోపేతమే మా లక్ష్యం

- పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు






**మధిరప్రజా జ్యోతి** మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన 2026 సంఘ సభ్యత్వ జనరల్ ఫండ్ క్యాంపెనింగ్ మధిర మండల శాఖ ఆధ్వర్యంలో 2026 సంఘ సభ్యత్వ జనరల్ ఫండ్ క్యాంపెయిన్ ను చేపట్టినట్లు మధిర మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్ పేర్కొన్నారు. మండలంలో చిలుకూరు ఖమ్మంపాడు దెందుకూరు ఇల్లూరు మడుపల్లి మహదేవపురం, మధిర టౌన్ పాఠశాలలు తదితర పాఠశాలల్లో మొదటిరోజు క్యాంపెయిన్ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్ లో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలో సంస్కరణలు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దానిలో భాగంగానే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు,తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు పాఠశాలల కుదింపు వంటి కార్యక్రమాలతో ముందుకు పోతుందని అయితే ప్రభుత్వం చేపట్టే విద్యాసంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల మనుగడకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న లక్షలాదిమంది విద్యార్థులకు మేలు చేకూరేలా ఉండాలని ప్రభుత్వం తీసుకుంటున్న విద్యా సంస్కరణలలో మేధావులు, విద్యావేత్తలు,ఉపాధ్యాయ సంఘ నాయకుల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఉపాధ్యాయులంతా వేసవి సెలవుల్లో బడి బాట లో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.వేసవిలో సెన్సెస్ డ్యూటీ లో పాల్గొని విజయవంతం చేసిన ఉపాధ్యాయులందరికి జిల్లా శాఖ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.క్యాంపెయిన్ లో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వి.రవికుమార్ రాష్ట్ర బాధ్యులు డి.వెంకటేశ్వరరావు షేక్ .మదార్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్ నాయకులు కొలగాని ప్రసాదరావు తెల్ల మేకల శ్రీనివాసరావు ఎల్.అప్పారావు టి అజయ్ కుమార్ ఎం .నాగేశ్వరరావు మేడిశెట్టి కృష్ణారావు రుద్రపోగు శ్రీనివాస్, మహ్మద్ చిన్న వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ అప్రెంటీస్ షిప్ ట్రైనింగ్ స్కీం ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- యువతకు విస్తృత అవగాహన కల్పించాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎం ఎ టి ఎస్ 2.0)ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, సంస్థలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ లో పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులు, సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎన్ ఎ టి ఎస్ 2.0)' ద్వారా తెలంగాణలోని యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఇంజనీరింగ్, డిప్లొమా,ఆర్ట్స్,సైన్స్, కామర్స్ అభ్యసించిన యువతకు పరిశ్రమలలో నైపుణ్య శిక్షణ అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు.ఈ పథకం ద్వారా పరిశ్రమలు తమకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను సులభంగా ఎంపిక చేసుకోవచ్చని,శిక్షణ పొందుతున్న అప్రెంటిస్‌లకు ఇచ్చే స్టైఫండ్‌లో ప్రభుత్వ వాటా నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా అభ్యర్థుల ఖాతాలకు జమ చేయబడుతుందని తెలిపారు.అప్రెంటిస్‌షిప్ పూర్తయిన తర్వాత సంస్థలకు నేరుగా పరిశ్రమ ప్రమాణాలకు తగ్గట్టుగా తయారైన ఉద్యోగులు లభిస్తారని కలెక్టర్ అన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ ( ఎన్ఏటిఎస్ 2.0) పోర్టల్ ద్వారా సంస్థలు అప్రెంటిస్ ఖాళీలను ప్రకటించడం,దరఖాస్తులను పరిశీలించడం,కాంట్రాక్టులను సృష్టించడం వంటివి పూర్తిగా డిజిటల్ విధానంలో చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్ఎంఈ సంస్థలు అప్రెంటిస్‌లను నియమించుకోవడానికి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ అధికారిక పోర్టల్‌లో తమ సంస్థను నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాసరావు,ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి ..!

- చెన్నారం వాసి తోల్ల నాగయ్య వడదెబ్బకు మృతి
- భార్య, ఇద్దరు చిన్నారులను శోకసంద్రంలో ముంచిన విషాదం



**నేలకొండపల్లి, జూన్ 17 ప్రజా జ్యోతి :**మండుతున్న ఎండలు మనుషుల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ఉదయం నుంచే నిప్పులు చెరిగే సూర్యుడు, మధ్యాహ్నానికి భరించలేని వేడితో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా నెలకొండపల్లి మండలం చెన్నారంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వడదెబ్బ కారణంగా ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చెన్నారం గ్రామానికి చెందిన తోల్ల నాగయ్య (40) ఉపాధి నిమిత్తం బుధవారం బయటకు వెళ్లారు. రోజంతా తీవ్ర ఎండలో తిరగాల్సి రావడంతో ఆయన అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి చేరుకున్న అనంతరం ఆరోగ్యం మరింత క్షీణించడంతో చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. బుధవారం తెల్లవారుజామున నాగయ్య కన్నుమూశారు. నాగయ్య మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉండటంతో కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్థులను కంటతడి పెట్టించాయి. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న నాగయ్య ఆకస్మిక మరణం వారిని ఆర్థిక, మానసికంగా తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా, జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు మినహా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం, తరచూ నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించడం అవసరమని పేర్కొంటున్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు



**నేలకొండపల్లి, జూన్ 17 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలోని రాయిగూడెం గ్రామానికి చెందిన బోయిన బ్రహ్మం–లలిత కుమార్తె ఓణీల అలంకరణ కుమారుని పంచెకట్టు వేడుకలలో రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబురు దయాకర్ రెడ్డి పాల్గోని,చిన్నారులను ఆశీర్వదించారు...ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడాలి గోవింద్ రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్,నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యడవల్లి సైదులు,నంబూరి రామారావు, కుక్కల హనుమంతురావు,సూరేపల్లి ప్రేమ్ కుమార్,బైరు లక్ష్మి నారాయణ,మాధారు,తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన పోలీసులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తలసేమియాతో పోరాడుతున్న పిల్లలకు మేమున్నామంటూ సహాయం చేయడానికి ఖమ్మం టౌన్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏసీపీ రమణమూర్తి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి 100 మందిపైగా దాతల నుంచి రక్తం సేకరించి తలసేమియా బాధితులకు అప్పగించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు.ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు,పెళ్లిరోజు వంటి సందర్భాల్లో రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. దాతలు తక్కువ కావడం వల్లే అవసరాలకు సరిపడా రక్తం లేక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.రక్తాన్ని దానం చేయడం ద్వారా కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్, అంబులెన్స్ , ప్రజలు రక్తదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు కరుణాకర్,బాలకృష్ణ,మోహన్ బాబు, ఉస్మాన్ షరీఫ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడి ఉద్యోగులపై పని భారం పెంచుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు

- సీఐటీయూ జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రం రైతు వేదికలో సర్ ఎన్నికల చట్టం జరుగుతున్న అవగాహన సదస్సులో అంగన్వాడి ఉద్యోగుల బి ఎల్ ఓ లు గా నియమించిన వారి సమస్యలపై అధికారులకు వినతిపత్రం సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అందించడం జరిగింది. సీఐటీయూ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండల ప్రభాకరరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్కు రూ. 18,000/–ల వేతనం పెంచుతామని, పి.ఎఫ్ సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటింది.అయినా నేటికి వేతనాలు పెంచలేదు. 24 రోజుల సమ్మె వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్స్ ఎరియర్స్, పి.ఆర్.సి ఎరియర్స్ తదితర డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉండటం వల్ల అంగన్వాడీ ఉద్యోగులు అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతురన్నారు. ఓటర్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడి లాంటిదనీ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని సూచించారు. ఎన్నికల వ్యవస్థను, ఓటరు హకులను కాపాడేందుకు వామపక్షా పార్టీలు నిరంతరం కృషి చేస్తున్నయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఎస్ ఆశా జె.పద్మావతీ పి. నాగమణి ఎస్. గీతా రత్నకుమారి పి. మేరీ కాంతం. వి.వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.